క్లుప్తంగా

వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించాలి

ట్రస్టు బోర్డు తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్‌బాబు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఏటా నిర్వహిస్తున్నట్టే ఈసారీ వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించాలని ట్రస్ట్ బోర్డు తీర్మానించింది. గురువారం ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధ్యక్షన జరిగిన సమావేశంలో వచ్చే నెల 12వ తేదితో ట్రస్టుబోర్డు పదవీ కాలం పూర్తి కావడంతో ఈ లోపుగా హుండీల లెక్కింపు పూర్తి చేయాలని రమేష్ బాబు సూచించారు. ఇకపై నిత్యం ఉదయం, సాయంత్రం ఉపాలయాల్లోనూ దీపాలు పెట్టాలని ఈఓ డి.నాగమల్లేశ్వరరావులను చైర్మన్ ఆదేశించారు. ట్రస్టు బోర్డు సభ్యులు చల్లా కుమారి, బొందలపు కృష్ణవేణి, కర్రి వెంకటలక్ష్మి, ముమ్మిడి బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు

పెద్దాపురం: మండలంలోని చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో గురువారం మందిర వ్యవస్థాపకుడు, క్రిస్టియన్ గాస్పెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, దైవజనులు అభిషేక్, జయకుమార్, వంకా జాన్‌ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని వారు సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పురుషోత్తమ్‌దాసు

పెద్దాపురం: మండలంలోని జి.రాగంపేటలో క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 80 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు ఆ సంస్థ అధ్యక్షులు లంక పురుషోత్తమ్‌దాస్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు ప్రారంభించగా రాజారావు, వైఆర్ మున్నా, శ్యాంసుందర్, మోషే తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి వైద్య శిబిరం నిర్వహించారు. 46 మంది కంటి పరీక్షలు, 12 మందికి ఆపరేషన్లు, మిగిలిని వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కిరణ్, సజీవ్‌రాజు, జేమ్స్, విమోచనరాజు పాల్గొన్నారు.

మరిడమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.11.98 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆసాదులు, భక్తులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి హుండీల ద్వారా 28 రోజులకు సుమారు రూ.97,97,720 సమకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు నాయుడు, ఈఓ కె.సుబ్రహ్మణ్యం సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యజ్ఞం బ్రోచర్ విడుదల

కాకినాడ కల్చరల్: స్థానిక ఆనందభారతి గ్రౌండ్‌లో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పరిషత్, శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్న శ్రీవిరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం బ్రోచర్‌ను గురువారం ఆనంద భారతి మైదానంలో నిర్వాకులు విడుదల చేశారు. విలేకరుల సమావేశంలో పరిషత్ అధ్యక్షులు అరికట్ల గోవర్ధన శాస్త్రి మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహించే యజ్ఞ మహోత్సవంలో భక్తులు పాల్గొని విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి కందుకూరి వెంకట సత్యబ్రహ్మాచార్యులు, సంఘం అధ్యక్షులు బి.చంద్రశేఖర్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

చక్కదిద్దబడి..

- ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు
- సంతృప్తిని వ్యక్తం చేస్తున్న పేరెంట్స్
- ఉత్సాహంగా ఉపాధ్యాయులు



చేబ్రోలు హైస్కూల్‌లో సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

పిఠాపురం: పేరెంట్స్ మీటింగ్‌లు అంటే ప్రైవేటు పాఠశాలలకే పరిమితం. ప్రభుత్వ పాఠశాలల్లో జరిగినా అవి పేరెంట్ కమిటీ మీటింగ్‌లు మాత్రమే. కాని ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాలతో సర్కారీ స్కూళ్లలోనూ పేరెంట్స్ మీటింగ్‌లు జరుగుతున్నాయి. ఇదిగో మీ పిల్లలు ఇలా చదువుతున్నారు.. మీ ప్రోత్సాహం ఉంటే ఇంకా బాగా చదువుకుంటారు అంటూ ఉపాధ్యాయులు పిల్లల విద్యా విధానాన్ని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. దీంతో పేదల బడి మారిందంటూ సర్కారు బడికి సలాం కొడుతున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు.

నాడు నిర్వీర్యం

గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యాయి. దీంతో అక్కడ తమ పిల్లలను చదివించుకోలేక వేలకు వేలు ఫీజులు చెల్లించి ఎక్కడో దూర ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలలకు పంపేవారు తల్లిదండ్రులు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ పరీక్షల అనంతరం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలంటూ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. తమ పిల్లలు పరీక్షలు ఎలా రాశారు.. ఎలా చదువుతున్నారు.. ఎన్ని రోజులు బడికి హాజరయ్యారు.. ప్రోగ్రెస్ రిపోర్టు.. పరీక్షల్లో వచ్చిన మార్కులు తదితర విషయాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలు బడి నుంచి ఇంటికి వచ్చాకా ఎలా బాధ్యత తీసుకుని చదివించాలి అనే విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో అన్ని పాఠశాలల్లోనూ తల్లిదండ్రులు సర్కారు బడికి సలాం అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

ఇంత మార్పు చూస్తామనుకోలేదు



నా పేరు కానూరి వీర బాబు. మాది కొత్తపల్లి మండలం వాకతిప్ప. నా ఇద్దరు కుమారులు వినయ్ (ఐదో తరగతి), భువన కుమారస్వామి (తొమ్మిదో తరగతి) వాకతిప్ప హైస్కూల్‌లో చదువుకుంటున్నారు. ఒక్క పైసా ఖర్చు లేదు. అయినప్పటికీ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చదువుతున్నారు. గతంలో తెలుగు కూడా సరిగా నేర్పని పరిస్థితి నుంచి ఏకంగా ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడే పరిస్థితికి సర్కారీ స్కూళ్లను మార్చేశారు సీఎం వైఎస్ జగన్. మాకు అమ్మఒడి డబ్బులు వేసి మా పిల్లల చదువు మాకు భారం లేకుండా చేశారు. ఇప్పుడు మమ్మల్ని పిలిచి గౌరవంగా మా పిల్లల చదువును మాకు వివరించడం ఆనందంగా ఉంది.

మాకు బాధ్యత పెరిగింది



నా పేరు సానా వరలక్ష్మి. మా అబ్బాయి వీరరాఘవులు వాకతిప్ప హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువు బాగా రాదని ఎంత కష్టమైనా, అప్పులు చేసైనా ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకోవాలని అనుకునే దానిని. ఐదో తరగతి అయ్యాక ప్రైవేటు స్కూల్‌కు మార్చేద్దాం అనుకున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చాకా సర్కారీ స్కూళ్ల తీరు మారిపోయింది. చదివిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలనే పరిస్థితి వచ్చేసింది. ఇదివరకు ఎప్పుడు వినలేదు.. చూడలేదు ఇలా తల్లిదండ్రులను పిలిచి మా పిల్లల పని తీరును మాకు వివరించడం. ఇప్పుడు మాకు బాధ్యత పెరిగింది.

మంచి స్పందన



గతంలో ఎవరైనా తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లల గురించి అడిగితే ఏం చెప్పాలో అయోమయంగా ఉండేది. కాని ఇప్పుడు కాలరెగరేసి మరీ మేం ఇంత బాగా చదువు చెబుతున్నాం, మీ బాధ్యత మీరు నిర్వర్తించండి అని చెప్ప గలుగుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల తీరు మారింది. సకల సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి పెరిగింది. తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. మేము బాగా చదవకపోతే మా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల వద్ద తలిదించుకుంటారేమో అనే భావన విద్యార్థుల్లో కలిగి అందరూ పట్టుదలతో బాగా చదివే అవకాశం ఉంది. పేరెంట్స్ మీటింగ్స్‌కు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చింది.

– చామర్తి ప్రకాష్, హెచ్‌ఎం, చేబ్రోలు జెడ్పీ హైస్కూల్, గొల్లప్రోలు మండలం

వార్డు సభ్యులకు నామినేషన్ల దాఖలు

సామర్లకోట: మండల పరిధిలో చంద్రంపాలెం, పవర, వేట్లపాలెం పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యులకు గురువారం నామినేషన్లు దాఖలయ్యాయి. చంద్రంపాలెంలో నాలుగో వార్డుకు ఐదు దరఖాస్తులు, వేట్లపాలెం 14వ వార్డుకు 4 నామినేషన్లు పవరలోని ఐదవ వార్డుకు ఒక నామినేషన్ దాఖలైనట్టు ఎంపీడీఓ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యదర్శుల శిక్షణ ప్రారంభం

సామర్లకోట: కాకినాడ జిల్లా పరిధిలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని సచివాలయ కార్యదర్శులకు రెండో బ్యాచ్ శిక్షణ గురువారం టీటీడీసీలో ప్రారంభించారు. సచివాలయ కార్యదర్శులకు కంప్యూటర్ పరిజ్ఞానం, సోషల్ మీడియాపై అవగాహన కల్పిస్తున్నారు. కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలతో పాటు గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలలో పని చేస్తున్న సచివాలయాల్లోని ఆరు కేటగిరీలలోని సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నారు. న్యూ ఢిల్లీకి చెందిన టీసీఐఎల్ ప్రతినిధి శ్రీకైలాస్ శిక్షణ ఇస్తున్నారు. ఆయా మున్సిపాలిటీలకు చెందిన నోడల్ అధికారులు సీహెచ్, సుజాత, యు.జ్యోతిరామ్, ఎస్వీ రామారావు, కె.శ్రీనివాసరావు శిక్షణను పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



దుర్గాడలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- దుర్గాడలో గడపగడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన ఆయన ప్రతిఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా పరిపాలన ప్రజల ముంగిటకు చేరిందన్నారు. గతంలో ఏ చిన్న పని కావాలన్నా సుదూర ప్రాంతాల్లోని మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దే గ్రామ సచివాలయాలు ఉండడం వల్ల ఏపని ఉన్నా క్షణాల్లో చేయించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. అందరికీ అన్నంపెట్టే రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 19 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల నులి పురుగులు బయటకు పోయి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: మండల విద్యాశాఖ సిబ్బంది పర్యవేక్షణలో పలు పాఠశాలల్లో, అంగన్‌వాడీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా వార్డులోని కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సిద్ధం



దుర్గాడ హైస్కూల్‌లో సాంస్కృతిక ప్రదర్శనకు కసరత్తు చేస్తున్న విద్యార్థినులు

పిఠాపురం: ఈ నెల 15 నిర్వహించే పంద్రాగస్టు వేడుకలుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో క్రీడా పోటీలు ప్రారంభించారు.

ఓటరు సర్వే బాధ్యత బీఎల్‌ఓలదే

పెద్దాపురం: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల నియమావళి తప్పక అమలు చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ స్పందన హాలులో గురువారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల ఓటర్ల ప్రక్రియపై సమీక్షించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల సర్వేకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో 94,075 ఇళ్ల సర్వే చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 55,625 ఇళ్ల పూర్తి అయ్యాయన్నారు. ఈ నెల 21వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఓటరు సర్వే ప్రక్రియతో పాటు కొత్త ఓటు నమోదుతో పాటు సర్వే ప్రక్రియపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆర్డీఓ సూచించారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ పద్మజ, డీటీ భానుకుమార్, ఎన్నికల డీటీ కాంతారావు పాల్గొన్నారు.

వాహ్... ఎరివ్నా!

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియం విజ్ఞాన వీచికలతో విరాజిల్లుతోంది. దేశ విదేశాల నుంచి వచ్చిన భావి వైద్యుల జ్ఞాన సమూపార్జనను చూసి ఉప్పొంగి పోతోంది. ఎరివ్నా పేరుతో రంగరాయ వైద్య కళాశాల ఫైనల్ ఇయర్ ఎంబీబీస్ విద్యార్థులు తమ కోర్ కమిటీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సు విజ్ఞాన విస్తరణకు ఎంతో దోహదం చేసింది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవిల పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు దాదాపుగా దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి వైద్య విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. విదేశీ విద్యార్థులతో కలిసి 500 మంది హాజరయ్యారు. వివిధ డిపార్టుమెంట్ల పరిధిలో హెచ్‌ఓడీల సమక్షంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లు విజ్ఞాన సదస్సుకు ఆకర్షణగా నిలిచాయి. ఫోరెన్సిక్, గైనికాలజీ, జనరల్ మెడిసిన్, అనస్థీషియా, పీడియాట్రిక్స్, పాథాలజీ, ఫార్మకాలజీ, అనాటమీ, ఆర్థోపెడిక్స్, న్యూరోసర్జరీ హెచ్‌వోడీల సమక్షంలో ఈ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ ఆర్‌ఎస్ జవహర్ అతిథులుగా హాజరయ్యారు.

మొక్కజొన్న, పత్తి పంటల పరిశీలన



తాటిపర్తిలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మొక్కజొన్న, పత్తి పంటలను పెద్దాపురం ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మునిరత్నం, శర్మ, బాలాజీ మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దీని నివారణకు తొలి దశలోనే వేప నూనె వాడాలన్నారు. ఎకరానికి నాలుగు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పత్తి పంటను పరిశీలించి పంటకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. గొల్లప్రోలు వ్యవసాయశాఖాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఈఓపీఆర్డీ భాస్కరరావు గురువారం తెలిపారు. కొండెవరం గ్రామ సర్పంచ్ వేమగిరి చెల్లాయమ్మ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇటీవల డీఎల్‌పీఓ విచారణ నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. సర్పంచ్ పంచాయతీ నిధులు రూ.4,63,160 దుర్వినియోగం చేసినట్లు రుజువు కావడంతో ఆమె చెక్ పవర్‌ను రద్దు చేశారు.

ర్యాగింగ్ చట్టంపై అవగాహన

కాకినాడ లీగల్: సీనియర్ విద్యార్థినులు జూనియర్లను ర్యాగింగ్ చేయడం వల్ల వారి బంగారు భవిష్యత్తు పాడయ్యే అవకాశం ఉందని కాకినాడ ఐదో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. న్యాయమూర్తి మట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థినుల ఉన్నత చదువులకు అనేక సౌకర్యాలు కల్పించడానికి ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. ఈ సదస్సులో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ వర్మ, సిబ్బంది, విద్యార్థులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటా ప్రచారం

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో గురువారం టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానంద రెడ్డి, కొర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో మౌజీరాయ్‌కు గోల్డ్ మెడల్

కరప: బీఎస్సీ హోం సైన్స్‌లో మండలానికి చెందిన వలసపాకల గ్రామానికి చెందిన వింత మౌజీ రాయ్ స్వర్ణ పతకం సాధించింది. ఆమె తల్లి వింత దైవకుమారి అంగన్‌వాడీ టీచర్ కాగా, తండ్రి గంగరాజు పాస్టర్. కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల కళాశాలలో డిగ్రీ చదివిన ఆమె ప్రతిభ చూపడంతో కేవీఆర్ చౌదరి అవార్డు గోల్డ్ మెడల్, సంస్కృతం కాంపిటీషన్ పరీక్షల్లో ప్రథమ స్థానంపొంది వైవీ నరసింహారావు మెమోరియల్ స్కాలర్‌షిప్ సాధించినట్టు తల్లి దైవకుమారి గురువారం విలేకరులకు తెలిపారు.

గుర్రపుడెక్క తొలగింపు



హుస్సేన్‌పురం కాలిబాట వంతెన వద్ద గుర్రపు డెక్క తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఇటీవల సాక్షి దినపత్రికలో ‘గుర్రపు డెక్కతో సాగునీటికి అంతరాయం’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. బిక్కవోలు నుంచి గుర్రపు డెక్క తొలగిస్తూ వస్తున్నారు. మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామంలో గోదావరి కాలువలపై ఉన్న కాలిబాట వంతెన వద్ద తరుచూ గుర్రపు డెక్క మొలిచి సాగునీటికి అంతరాయం కలిగిస్తోంది. గురువారం హుస్సేన్‌పురం, మాండవ్య నారాయణస్వామి ఆలయం వద్ద కాలిబాట వంతెన, ఐదు తూముల వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభించారు. గుర్రపు డెక్కను తొలగించి రోడ్డు మార్జిన్‌లో వేస్తున్నారు. దాంతో వర్షపు నీరు పాయే మార్గం లేక నీరు నిలచి గోతులు పడుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని తొలగించిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించి రోడ్లకు రక్షణ కల్పించాలని హుస్సేన్‌పురం ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు అచ్చారావు డిమాండ్ చేస్తున్నారు.

సమన్వయంతోనే పిల్లల ప్రగతి సాధ్యం



హైస్కూల్‌లో గోరు ముద్దను రుచి చూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సామర్లకోట: విద్యార్థి జీవితంలో హైస్కూల్ స్థాయి చాలా ప్రాముఖమైనదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతోనే విద్యార్థుల అభివృద్ధి సాధ్యపడుతుందని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. గురువారం హెచ్‌ఎం అధ్యక్షత విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వాటిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు అన్నారు. పేరెంట్స్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ పప్పు మాధవీ దేవి, ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోరుముద్దను తల్లిదండ్రులు రుచి చూశారు.

ఘనంగా నా భూమి-నా దేశం



చదలాడలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



గొర్సలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ వీరబాబు

పెద్దాపురం: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి గౌరవార్థం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని చదలాడ గ్రామ సచివాలయంలో గురువారం నా భూమి –నా దేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో నేలతల్లికి ప్రణామం – వీరులకు వందనం పేరుతో పంచాయతీ కార్యదర్శి బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించి సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, ఎంపీటీసీ శైల గణేష్, ఒబిలిశెట్టి బాల, శేరు వెంకబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతిజ్ఞ చేశారు.

గ్రామాల్లో జోరుగా ‘నా భూమి-నా దేశం’

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో గురువారం నా భూమి-నా దేశం కార్యక్రమాలు నిర్వహించారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చెరువు గట్లపై ప్రత్యేక శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామాల్లో మొక్కలు నాటారు. గొర్సలో సర్పంచ్ రొంగల వీరబాబు ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని జాతికి అంకితం చేశారు. పాత ఇసుకపల్లి, కొత్త ఇసుకపల్లి గ్రామాల్లో సర్పంచులు సన్నిబోయిన రిబ్కా, తమిలిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. జాతీయ జెండాలతో గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, పంచాయతీ కార్యదర్శి వారిజ, ఉపాధి ఏపీఓ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో ‘నా మట్టి – నా దేశం’

సామర్లకోట: నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలో పీబీ దేవం, వీకే రాయపురం, బోయనపూడి పంచాయతీల్లో స్వాతంత్ర యోధులు, రక్షణ దళ సభ్యులకు వందనం చెప్తూ శిలా ఫలకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞలు చేశారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ , ఉపసర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామకృష్ణ పాల్గొన్నారు.



వీకే రాయపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ తదితరులు



పాత ఇసుకపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు